బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ సాయం

రామాయంపేట, డిసెంబర్ 1: రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన తాటి వెంకటమ్మ(65) అనారోగ్యం కారణంగా మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలతో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఏడుపాయల్లో భక్తుల సందడి

ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భక్తులు

పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట, డిసెంబర్ 1: ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం భారీగా భక్తుల సందడి నెలకొన్నది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వర్ణాచారి, రాజు ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బందోబస్తు చేపట్టారు.

తునికి నల్ల పోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

తునికి నల్లపోచమ్మ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి, డిసెంబర్ 1: తునికి నల్ల పోచమ్మ దేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని తునికి గ్రామంలో వెలిసిన నల్లపోచమ్మ ఆలయానికి ఆయా జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈవో రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మెదక్‌రూరల్, డిసెంబర్ 1: కార్తిక మాస అమవాస్య ఆదివారాన్ని పురస్కరించుకుని కొయ్యగట్టు మల్లన్న ఆలయంలో భక్తులు భారీగా తరలివచ్చారు. పూజరి మల్లన్న ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

రెండు పంటలకూ రైతుభరోసా ఇవ్వాలి

- రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్

నర్సాపూర్, డిసెంబర్ 1: రెండు పంటలకు రైతుభరోసాను ఈనెల మొదటి వారంలో రైతుల ఖాతాలో వేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి సీజన్ ప్రారంభమైందని, ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వక పోవడంతో రైతులకు పెట్టుబడి తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఎద్దేవా చేశారు. పంట పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నారన్నారు. వానకాలం వడ్లను సరైన సమయంలో కొనకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుని నష్టాల్లో కూరుకుపోయారన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకోవడం కాదని, వారికి మేలు చేసి రైతుల పక్షాన నిలవాలన్నారు.

దళితుల ఐక్యత కోసం 'చలో హైదరాబాద్'

పాపన్నపేట: మాలల సింహగర్జనకు తరలిన పాపన్నపేట మాలలు

రామాయంపేట, డిసెంబర్ 1: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహానాడు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మాలల సింహగర్జనకు తరలివెళ్లారు. రామాయంపేటలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలం నుంచి సుమారు 500 మంది మహాసభకు తరలివెళ్లారు.

నిజాంపేటలో..

నిజాంపేట, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు నిజాంపేట మండలంలోని నస్కల్, నార్లపూర్, నిజాంపేట, కల్వకుంట వివిధ గ్రామాల నుంచి భారీగా మాలలు తరలివెళ్లారు. మాల మహానాడు మండల గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు రాజయ్య, చంద్రం ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జనకు చిలిపిచెడ్ మండలం నుంచి మండల మాలల మహానాడు అధ్యక్షుడు బేగరి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో భారీగా మాలలు తరలివెళ్లారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట, డిసెంబర్ 1: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు పాపన్నపేట నుంచి పెద్దఎత్తున మాలలు తరలివెళ్లారు. పాపన్నపేటలోని హరిజన వాడకు చెందిన చిన్నాపెద్దా కలిసి డీసీఎం వాహనంలో తరలివెళ్లారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★గౌడ్స్ మ్యారేజ్ బ్యూరో యందు పని చేయుటకు ఎంప్లాయిస్ కావలెను. కంప్యూటర్ ఆపరేటర్స్, టెలికాలర్స్ కావలెను. ఆఫీస్ అడ్రస్: మెదక్ రోడ్, సాయిరాం హాస్పిటల్ 4th ఫ్లోర్. జీతం: 6,000/- నుండి 8,000/- వరకు. కాంటాక్ట్ నెంబర్: 9666699765, 9550525975.
NT-Tirupathi
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేంకటేశ్వర ఆలయంలో లక్ష పుష్పార్చన

టేక్మాల్, డిసెంబర్ 1: టేక్మాల్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో మహా రుద్రపారాయణం, లక్షపుష్పార్చన, ప్రత్యేక పూజలను మాధవానంద స్వామి పర్యవేక్షణలో ఆదివారం చేశారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ

రామాయంపేట, డిసెంబర్ 1: కామారెడ్డిలోని దవాఖానలో 110 మందికి కంటి పరీక్షలు చేయించి, ఉచితంగా అద్దాలను పట్టణంలోని సంఘ సేవకుడు పుట్టి సందీప్ తన పుట్టినరోజు సందర్భంగా అందజేశారు.

చెత్తపై చిత్తశుద్ధి ఏదీ!

- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- పంచాయతీల్లో తయారుకాని సేంద్రియ ఎరువు
- రూ.కోట్లల్లో ప్రజాధనం వృథా
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

దంతెపల్లి పంచాయతీ పరిధిలోని లాక్యతండాలో నిరుపయోగంగా ఉన్న డంపుయార్డు

రామాయంపేట మండలం పర్వతాపూర్‌లోని డంపు యార్డు

మెదక్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): పల్లెల్లో పారిశుధ్యంతో పాటు చెత్త నుంచి సంపద తయారీ కోసం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. ప్రజారోగ్యంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు అలంకారప్రాయంగా మారాయి. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి, కంపోస్టు ఎరువు తయారు చేయాల్సి ఉండగా, అది ఎక్కడా అమలుకావడం లేదు. నిధుల లేమి, పారిశుధ్య సిబ్బంది కొరతతో లక్ష్యం చేరుకోవడం ఇబ్బందిగా మారింది. ఫలితంగా లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

రూ.11.72 కోట్ల వ్యయంతో నిర్మాణం

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని 469 గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ నిధులు రూ.11.72 కోట్లతో డంపింగ్ యార్డులు నిర్మించింది. ఒక్కో డంపు యార్డుకు రూ.2.50 లక్షల చొప్పున ఖర్చు చేశారు. వీటితో పాటు చెత్త సేకరణకు ప్రతీ పంచాయతీకి ప్రత్యేకంగా ఒక ట్రాక్టర్‌ను సమకూర్చారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేసేందుకు ఇంటింటికీ రెండు చెత్త బుట్టలు కూడా పంపిణీ చేశారు. అనంతరం చెత్త నుంచి సంపదను సృష్టించి, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలనే లక్ష్యంతో వాటిని ఏర్పాటు చేశారు. ఆ లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం కావస్తున్నా డంపింగ్ యార్డులను పట్టించుకోవడం లేదు. ఇంతవరకు ఒక తట్ట చెత్త కూడా అక్కడ వేసిన పాపానపోవడంలేదు. పంచాయతీ కార్యదర్శులు సైతం దీనిపై దృష్టి సారించకపోవడంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. దీంతో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్ యార్డులు అలంకార ప్రాయంగా మారాయి. కొన్ని పంచాయతీల్లో యార్డులు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మొత్తమ్మీద నాటి ప్రభుత్వం లక్షల ఖర్చు చేసి నిర్మించిన డంపింగ్ యార్డులు నేటి పాలకులతో పాటు, అధికారులకు కూడా పనికి రాకుండా పోయాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అందుబాటులోకి తేవాల్సి ఉంది.

ఘనంగా విద్యా దినోత్సవం

- సృజనాత్మకత, ఆలోచన శక్తి, అభివృద్ధి చేయడమే లక్ష్యం
- కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థిలను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నిజాంపేట: బాలుర వసతి గృహంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచన శక్తి అభివృద్ధి చేయడమే విద్యా దినోత్సవం లక్ష్యమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఘనంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. 'ప్రత్యామ్నాయ ఇంధన వనరులు' అనే అంశంపై జిల్లాలోని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు మెమోంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం గురుకులంలోని వంటశాలకు వెళ్లి భోజన నాణ్యతను పరిశీలించారు. నాణ్యతో కూడిన భోజనాన్ని అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, డిసెంబర్ 1: నిజాంపేటలోని బాలుర వసతి గృహంలో 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఎంఈవో యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లోఅన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

చిట్కుల్‌లో...

చిలిపిచెడ్, డిసెంబర్ 1: మండలంలోని చిట్కుల్ శివారులో కేజీబీవీలో వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో విఠల్ తెలిపారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి ఎ.నిహారిక, ద్వితీయ బహుమతి ఆర్.హారిక సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, డిసెంబర్ 1: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈవో అయిత శ్రీనివాస్ అన్నారు. కేజీబీవీలో మండల స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్, డిసెంబర్ 1: మండలంలోని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించా రు. ఈ పోటీల్లో ఎస్‌వి శ్రీజ (మోడల్ స్కూల్) ప్రథమ బహుమతి, కుసంగి పాఠశాల విద్యార్థిని హీనకు రెండో బహుమతి, ఎలకుర్తి పాఠశాలకు చెందిన సంగీత మూడో బహుమ తి గెలుపొందారు. విజేతలకు ఎంఈవో బహుమతులు అందజేశారు.

రేగోడ్‌లో...

రేగోడ్, డిసెంబర్ 1: కేజీబీవీలో మండల స్థాయి వ్యాసరచనల పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో గురునాథ్ తెలిపారు. 24 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు మహేశ్వరీ (మోడల్ స్కూల్), నవీన్(జడ్పీహెచ్ఎస్), సీహెచ్ హరిత (కేజీబీవీ) సాధించారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, డిసెంబర్ 1: నర్సాపూర్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, ఎంఈవో తారాసింగ్ విజేతలకు బహుమతులు అందజేశారు. మైనార్టీ స్కూల్‌కు చెందిన ఆకాశ్‌నాయక్ మొదటి బహుమతి, నారాయణపూర్ గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన పూజ ద్వితీయ బహుమతి అందుకున్నారు.

గజగజ..

- చలికి వణుకుతున్న ప్రజలు
- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 10.0 సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు
- చలిమంటలు కాచుకుంటున్న జనం

మెదక్ పట్టణ శివారులో కమ్ముకున్న పొగమంచు

చిన్నశంకరంపేటలో చలిమంట కాచుకుంటున్న యువకులు

మెదక్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): జిల్లాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. రెండు రోజుల కిందట రాత్రివేళల్లోనే చలి ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఉదయం ఆ ప్రభావం చూపుతున్నది. రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల వరకు బయటికి రావాలంటే ప్రజలు గజగజ వణుకుతున్నారు. తెల్లవారుజాము నుంచి రోడ్లను మంచు కప్పివేస్తున్నది. చలి తీవ్రతను తట్టుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనున్నదని వాతావరణ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల బాధితులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి పంజా విసురుతుండడంతో ఉదయం సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్రంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలో వారం క్రితం 11.5 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 10.0 డిగ్రీత లోపు చేరాయి. మెదక్ జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో చలి విజృంభిస్తోంది. గతేడాది 15 డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్, నర్సాపూర్, తూప్రాన్, చేగుంట, రామాయంపేటతో పాటు ఆయా మండల కేంద్రాల్లో స్వెటర్ల దుకాణాలు భారీగా వెలిశాయి. ఉదయం 5 గంటలకే మైదానానికి వెళ్లే వారు, పేపర్‌బాయ్‌లు, పాల వ్యాపారులు, హోటల్ వ్యాపారులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చలితో తీవ్ర అవస్థలు పడుతున్నారు. సాయంత్రం వేళల్లోనూ బయటకొచ్చేందుకు జనం జంకుతున్నారు. సాధ్యమైనంత వరకు వెచ్చటి ప్రాంతాల్లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

చిన్నారులు, వృద్ధుల్లో అస్తమా వ్యాధి ఉంటే ఈ చలితో మరింత ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉంటుంది. అలాంటివారు వెచ్చటి ప్రాంతాల్లోనే ఉండాలి. చలిగాలులు తగలకుండా ఉన్ని దుస్తులు వేసుకోవాలి. చిన్నారులు, వృద్ధులు తప్పకుండా స్వెట్టర్లు, మంకీ క్యాంపులు ధరించాలి. చర్మవ్యాధులు రాకుండా ఉదయం, సాయంత్రం చలిని తట్టుకునేందుకు కాస్మోటిక్స్ వాడాలి.

– డాక్టర్ పెంటాగౌడ్, జనరల్ ఫిజీషియన్, మెదక్

లలితా పరమేశ్వరీ దేవీ ఆలయంలో లక్ష దీపోత్సవం

చేగుంట, డిసెంబర్ 1: కార్తిక అమావాస్యను పురస్కరించుకుని వెంకటపూర్‌లోని లలితా పరమేశ్వరీ దేవీ ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని తులసి, ఉసిరి చెట్ల వద్ద జ్యోతులను వెలిగించి పూజలు చేశారు.

మెదక్ చర్చిలో ఘనంగా క్యారెల్స్ సండే

మెదక్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: క్యారెల్స్ సండేను పురస్కరించుకుని మెదక్ చర్చి భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఈ సందర్భంగా సీఎస్ఐ స్కూల్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో ఏసయ్య భక్తిగీతాలు ఆలపించారు. ప్రతి క్రిస్మస్‌కు ముందు వచ్చే డిసెంబర్ 1న క్యారెల్స్ సండే నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సండేలో, పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, శ్రీనివాస్, జైపాల్, కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రామాయంపేట, డిసెంబర్ 1: రామాయంపేట హరిజన కాలనీ ఒకటో వార్డుకు చెందిన బైరం దుర్గమ్మ అనారోగ్యంతో చికిత్స చేయించుకున్నది. ఎమ్మెల్యే సహకారంతో ఆమెకు రూ.9 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాత రావు, అధికార ప్రతినిది రాంచందర్‌గౌడ్, ఏసుగారి రమేశ్‌రెడ్డి, బైరంకుమార్ తెలిపారు.

కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళి

మలిదశ ఉద్యమంలో తెలంగాణ కోసం అసువులు బాసిన కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐ వెంకటరాజాగౌడ్ నివాళులర్పించారు. కానిస్టేబుల్ కిష్టయ్య తన వృత్తిని పక్కన బెట్టి తెలంగాణ కోసం ఆత్మ బలిదానం చేశాడని గుర్తుచేశారు. తెలంగాణ కోసం అమరుడైన పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కౌడిపల్లి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు. – రామాయంపేట/కౌడిపల్లి, డిసెంబర్ 1

మున్నూరుకాపు పిట్లంబేస్ అధ్యక్షుడిగా యాదగిరి

యాదగిరి

మధు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: మున్నూరుకాపు సంఘం పిట్లంబేస్ శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా ఆకారం యాదగిరి, అల్లం మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో సంఘ రాష్ట్ర నాయకుడు బండ నారాయణ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బండ సిద్ధయ్య, దుర్గయ్య, సంగాయిపేట కిషన్, మెరుగు రాజు, కార్యదర్శులుగా తిరుపతి, నర్సింలు, కృష్ణ, మల్లేశం, కోశాధికారిగా సురేశ్ ఎన్నికయ్యారు.

బ్లాక్ బెల్టులు సాధించిన విద్యార్థులు

బ్లాక్ బెల్టులు సాధించిన విద్యార్థులతో నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్‌లో రెంజుకీ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టార్లు విద్యాసాగర్, అశోక్, నవీన్, రియాజ్, మల్లేశం, లావణ్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

మోతీలాల్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబర్ 1: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లిపల్లి తండాకు చెందిన ధనావత్ మోతీలాల్ (35) మద్యానికి బానిసయ్యాడు. బాగా అప్పులు చేశాడు. ఆదివారం ఉదయం పొలం వద్ద ఉన్న గడ్డిమందు తాగాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వారు హుటాహుటిన నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు వైద్యపరీక్షలు చేస్తుండగా, పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య ధనావత్ అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళకు కల్లు తాగించి బంగారం చోరీ

రామాయంపేట, డిసెంబర్ 1: ఓ మహిళకు కల్లు తాగించి ఇద్దరు మహిళలు ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలు, వెండి గొలుసులు చోరీ చేసిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దుబ్బాక మండలం చెల్లాపూర్ గ్రామానికి చెందిన బైండ్ల నర్సమ్మ తన కూతురు వద్దకు వచ్చి తిరుగు ప్రయాణమైంది. బస్టాండులో ఇద్దరు మహిళలు మాయమాటలు చెప్పి మహిళను కల్లు దుకాణంలోకి వెళ్లి కల్లు తాగించారు. మత్తులో ఉన్న నర్సమ్మ ఒంటిపై తులం బంగారం చైన్, వెండి కడియాలు, నగదు ఎత్తుకుని వెళ్లిపోయారు. కొద్దిసేపటికి మెళకువ వచ్చి ఒంటిపై చూసుకునే సరికి బంగారం, వెండి కడియాలు, నగదు లేవు. స్థానికులు ఆమెను పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి మృతి

చేగుంట, డిసెంబర్ 1: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం చిట్టోజిపల్లిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి నర్సింహులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఎప్పుడూ మనస్తాపం చెందేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

తూప్రాన్, డిసెంబర్ 1: టిప్పర్ ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలపాలైన ఘటన తూప్రాన్‌లో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌కు చెందిన మర్యాల దశరథ్ (55) ఆదివారం పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా నుంచి తూప్రాన్ వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. వెనకాల నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టి కింద పడ్డాడు. ప్రమాదంలో దశరథ్ రెండు కాళ్లు విరిగాయి. మంటలు చెలరేగి బైక్ పూర్తిగా దగ్ధమైంది. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో సూరారంలోని నారాయణ మల్లారెడ్డి దవాఖానకు తరలించారు.